సాక్షి
ఖమ్మం
గురువారం । 10 । ఆగస్టు । 2023



'గృహలక్ష్మి' సందడి!

పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 8లో



.. వెన్ను విరుస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు రైతుల వెన్ను విరుస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు ఆరోపించారు. 8లో



వాతావరణం

జిల్లా అంతటా గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం వేళ ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన అథ్లెట్లు

ఖమ్మం స్పోర్ట్స్: హనుమకొండలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు వివిధ అంశాల్లో ఆరు పతకాలు లభించాయి. ఈమేరకు పరుగు పందెం, జావెలిన్ త్రోలో ఎస్.కే.లాల్‌పాషా, డి.నవ్య స్వర్ణ పతకాలు గెలుచుకోగా, మనుశ్రీ, కృష్ణవేణి కాంస్య పతకాలు, డి.బిందు, ఎస్.గోపీచందర్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, చీఫ్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, పవన్, హలీం అభినందించారు.

పామాయిల్ ఫ్యాక్టరీకి స్థల పరిశీలన



స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తి రెవెన్యూ గద్దలగూడెం, అంజనాపురం, ఉప్పలచలక మధ్య ప్రభుత్వ అసైన్డ్ భూములను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 111లోని సుమారు 126 ఎకరాల భూమిని పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం గోద్రెజ్ కంపెనీకి కేటాయించారు. ఇప్పటికే ప్రభుత్వం భూకేటాయింపు చేయగా భూమిని అదనపు కలెక్టర్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు. సదరు భూమిలో దళిత, గిరిజన రైతులు సేద్యం చేస్తున్నందున పరిహారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి అనసూయ, వైరా ఏడీఏ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్

ఖమ్మం సహకారనగర్: అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్ నాయక్‌ను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, డీడబ్ల్యూఓ సుమను కూడా సన్మానించారు. నాయకులు జీ.ఎస్.ప్రసాద్‌రావు, నాగుల్‌మీరా, వెంకటరెడ్డి, భాస్కర్, వై.శ్రీనివాసరావు, బుద్దా రామకృష్ణ, హబీబ్, నగేష్, రుక్మారావు, శాబాసు జ్యోతి, స్వప్న పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పెంపు



కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించారు. గతంలో ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన అధికారులు 17వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని నవోదయ ప్రిన్సిపాల్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా వ్యవసాయ కమతాల గణన




మాట్లాడుతున్న సీపీఓ శ్రీనివాస్, పక్కన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో వ్యవసాయ కమతాల గణన పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్య ప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్ సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ హాల్‌లో బుధవారం జిల్లా గణాంక, వ్యవసాయ శాఖల ఆధ్వర్యాన ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఓ మాట్లాడుతూ కమతాల గణనలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయాధికారి బి.సరిత మాట్లాడుతూ రైతుల జీవన స్థితిగతులు, కమతాల సమగ్ర స్వభావాన్ని తేల్చే ఈ గణనకు ఎంతో ప్రాధాన్యం ఉన్నందున జాగ్రత్తగా వివరాలు సేకరించాలని సూచించారు. ఆతర్వాత మూడు దశల్లో వివరాల సేకరణ, యాప్‌లో నమోదుపై అధికారులు వెంకటనర్సయ్య, శేఖర్ అవగాహన కల్పించారు.



తుమ్మల నాగేశ్వరరావు





కందాల ఉపేందర్‌రెడ్డి

పాలేరులో పోటాపోటీ!

- సై అంటున్న తుమ్మల, కందాల
- అనుచరులతో మాజీ మంత్రి ఆత్మీయ సమ్మేళనాలు
- కేసీఆర్ మాట నిలబెట్టేందుకు పోటీకి సిద్ధమని ప్రకటన
- మరోపక్క బరిలోకి దిగేది తానేనని కందాల ప్రచారం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్‌లో పోటీ నెలకొంది. ఈ స్థానం నుంచి బరిలోకి దిగడమే లక్ష్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పావులు కదుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ తనకేననే ధీమాలో ఇద్దరూ ఉన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్‌లో కొంతకాలంగా రెండు గ్రూపులు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతోపాటు ఘర్షణలకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో తుమ్మల, కందాల తమ కార్యాచరణలో వేగం పెంచారు. పార్టీ అధిష్టానం వద్ద, ప్రజల్లో తమ ప్రత్యేకతను చాటుకునేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

నాటి నుంచి వార్..

2018 ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి కందాల ఉపేందర్‌రెడ్డి పోటీ చేశారు. ఎన్నికల్లో కందాల విజయం సాధించగా అనంతర పరిణామాలతో ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి పార్టీలో రెండు గ్రూపులు ఏర్పడి.. అనుచరుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు పొడచూపాయి. పలుసార్లు ఇవి ఘర్షణకు కూడా దారితీయగా కేసులు పెట్టుకున్నారు. అధిష్టానం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా విడివిడిగానే నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో వీరిద్దరూ దూకుడు పెంచేలా కార్యక్రమాల నిర్వహణతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు.

ఆత్మీయ కలయికలు

మాజీ మంత్రి తుమ్మల ఆత్మీయ సమ్మేళనాలను మొదలుపెట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయన బీఆర్ఎస్ కేడర్‌ను కలిసేందుకు నిర్ణయించినట్లు అనుచర నేతలు పేర్కొంటున్నారు. దీనిలో భాగంగానే మంగళవారం నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమై అభివృద్ధి కోసం నాడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలేరులో నిలబెడితే అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన మాట పూర్తి చేసేందుకు, నిలబెట్టేందుకు మరోమారు పోటీకి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. దీంతో ఆయన పాలేరు నుంచే పోటీ చేయనున్నట్లు చెప్పినట్లయింది. త్వరలోనే మిగతా మండలాల్లో కూడా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలోనూ పలుమార్లు తుమ్మల పోటీ విషయాన్ని ప్రస్తావించడమే కాక తన అనుచరులకు కూడా చెబుతుండడంతో పాలేరులో బీఆర్ఎస్ రాజకీయం రసకందాయంగా మారింది.

శ్రావణం నుంచి మరింత వేగం

ఈనెల 17నుంచి నిజశ్రావణ మాసం ప్రారంభం కానుంది. ఈ మాసం తొలిరోజు నుంచే కార్యక్రమాల్లో మరింత పెంచాలనే భావనతో తుమ్మల, కందాల వర్గాలు ఉన్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో పోటాపోటీగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ఆత్మీయ సమ్మేళనాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారని సమాచారం. టికెట్‌పై ధీమా వ్యక్తంచేస్తున్న ఇద్దరు నేతలు ప్రజలను కలిసేందుకు వచ్చే ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకపోవడం... పాలేరు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై బీఆర్ఎస్ అధిష్టానం కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

పోటీలో నేనే.. గెలిచేదీ నేనే..

బీఆర్ఎస్‌లో వర్గపోరు నేపథ్యాన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సైతం నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బీఆర్ఎస్‌లో చేరినప్పటి నుంచి వర్గపోరు ఆయనకు సమస్యలా మారినా తన వర్గాన్ని రూపొందించుకుని నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటనల స్పీడ్ పెంచారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో పాల్గొంటూ కేడర్‌లో జోష్ పెంచుతున్నారు. 'బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేది నేనే.. గెలిచేది నేనే' అంటూ ఆయన ప్రచారం చేస్తున్నారు.

వీఆర్ఏల సర్దుబాటు పూర్తిచేయండి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్

ఖమ్మంసహకారనగర్: గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్ఏ)లను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసే ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో 610 మంది వీఆర్ఏలు ఉండగా, వీరిలో 114మందికి 61ఏళ్ల వయస్సు దాటిందన్నారు. మిగతా 496మందిని జిల్లాలోని వివిధ శాఖలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాలకు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్హతల ఆధారంగా పోస్టులు కేటాయించిన నేపథ్యాన ఇతర ప్రక్రియలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు.

మరింత వేగంగా క్రమబద్ధీకరణ

ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి జీఓ 58, 59 ద్వారా క్రమబద్ధీకరణ ప్రక్రియను ఈనెల 15 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన దరఖాస్తుల పురోగతిపై సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డి.మధుసూదన్‌నాయక్, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, వివిధ శాఖల అధికారులు సత్యనారాయణ, సుదర్శన్, పుష్పలత, కృష్ణలాల్, మల్లీశ్వరి, శైలజ, సుజాత, రమాదేవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కృషి

కొమరంభీం విగ్రహం ఆవిష్కరణలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కొమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

పెనుబల్లి: అడవినే నమ్ముకుని జీవించే నిష్కల్మష హృదయులైన ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం విగ్రహాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ పోడు పట్టాలు ఇవ్వడంతో ఇతర సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. అనంతరం విగ్రహాన్ని సమకూర్చిన గౌరారం సర్పంచ్ రుద్రారాణిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్యతో పాటు కొర్సా గంగాధర్, కాకా వెంకటేశ్వర్లు, పద్దం తిరుపతిరావు, కాకా సీతారాములు, పద్దం వెంకటేశ్వరరావు, కాకా రుద్రజారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

సత్తుపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయనను ఏఎన్ఎంలు కలిసి వినతిపత్రం అందజేశారు.

సర్వే పూర్తి.. సాయమే తరువాయి!

- మున్నేరు ప్రభావిత ప్రాంతాల్లో నష్టంపై సర్వే
- ఐదు కేటగిరీల్లో నష్టం అంచనాలు
- 1,888 ఇళ్లకు నష్టం జరిగినట్లు గుర్తింపు

కేటగిరిల వారీగా గుర్తించిన ఇళ్ల సంఖ్య

కేటగిరి 1	300
కేటగిరి 2	214
కేటగిరి 3	670
కేటగిరి 4	676
కేటగిరి 5	28



ఖమ్మంమయూరిసెంటర్: గతనెల చివరలో మున్నేరు ఉప్పొంగగా ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. గత నెల 26న రాత్రికి రాత్రే వరద ఆకస్మాత్తుగా పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు వెళ్లారు. ఈమేరకు నగరంలోని కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతినగర్, రామన్నపేట, ధంసలాపురం కాలనీ తదితర ప్రాంతాల్లోకి వరద చేరగా... కొన్ని ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. ఇంకొన్ని ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోగా, మరికొన్ని ఇళ్లు పూర్తిగా శిథిలం కావడంతో స్థానికులు భారీగా నష్టపోయారు. ఈమేరకు నష్టాన్ని అంచనా వేసేందుకు కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అధికారులు సర్వే చేసి నగరంలో 1,888 ఇళ్లు దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. ఆయా కుటుంబాలకు త్వరలోనే ప్రభుత్వం నుంచి సాయం విడుదల కానుందని తెలుస్తోంది.

పది బృందాలతో సర్వే

మున్నేరు వరదతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కూడిన పది బృందాలను కలెక్టర్ నియమించారు. నాయబ్ తహసీల్దార్, ఆర్ఐ, బిల్లు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్‌ను సభ్యులుగా నలభై మందితో పది బృందాలను నియమించి సర్వే చేయించారు. ఈమేరకు వీరు నష్టంపై అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

వరద ఆధారంగా కేటగిరీలు

ముంపు ప్రాంతంలో ఇళ్లకు జరిగిన నష్టాన్ని కేటగిరీల వారీగా నిర్ధారించారు. వరద నీరు ఇంటి దగ్గరకు వస్తే కేటగిరీ–1లో నమోదు చేయగా.. నీళ్లు ఇంటి ఆవరణ వరకు వస్తే కేటగిరి–2గా నివేదికలో పొందుపర్చారు. ఇక నీళ్లు ఇంటి లోపలికి వస్తే కేటగిరీ–3గా, నీళ్లు ఇంటి లోపల 5 అడుగుల ఎత్తు వరకు వస్తే కేటగిరీ–4, ఇల్లు మొత్తం పూర్తిగా మునిగి, గోడలు పడిపోయి వస్తువులన్నీ పాడైతే కేటగిరీ–5గా నిర్ధారించారు. ఈమేరకు కేటగిరీల వారీగా త్వరలోనే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించే అవకాశముందని సమాచారం.

ప్రజాభీష్టం మేరకే నా పోటీ

ఆదివాసీ దినోత్సవంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

రఘునాథపాలెం: జిల్లా ప్రజలు కోరుకుంటున్నట్లుగానే తాను పోటీ చేస్తానని, ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బంది పెడుతున్న వారిని ఇంటికి పంపించడమే లక్ష్యమని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్నింటిని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదిఏమైనా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే తన ధ్యేయమని.. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలనే భావనతో ఉన్నట్లు తెలిపారు. తొలుత పొంగులేటికి గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం పలకగా, వారితో కలిసి ఆయన కోలాట నృత్యం చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవ్‌సింగ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో పంటల సాగుపై అధ్యయనం



దానిమ్మ పంటను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల, వెంకటేశ్వరరావు తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఇజ్రాయిల్‌లో పంటల సాగు, విధానాలను అధ్యయనం చేసేందుకు వెళ్లిన బృందం పర్యటన కొనసాగుతోంది. ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో సాగు చేస్తున్న పొద్దు తిరుగుడుతో పాటు దానిమ్మ పంటను బుధవారం పరిశీలించారు. పంటల సాగులో పాటిస్తున్న మెళకువలు, దిగుబడి తదితర అంశాలపై అక్కడి శాస్త్రవేత్తలు, నిపుణులతో చర్చించారు. ఈ బృందంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు ఉన్నారు.

'దళితబంధు'తో ఆర్థికాభివృద్ధి



దళితబంధు లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిలాష

చింతకాని: దళితబంధు పథకం ద్వారా నెలకొల్పిన యూనిట్లను సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో దళితబంధు యూనిట్లను నిర్వహణను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు తాము అభివృద్ధి చెందడమే కాక మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని తెలిపారు. ఆతర్వాత యూనిట్ల స్థాపనకు ముందు, ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. అనంతరం పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలను కూడా అదనపు కలెక్టర్ అభిలాష పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సర్పంచ్‌లు నారపోగు కొండలరావు, అంగిడి ఝాన్సీ, నక్కనబోయిన సుజాతతో పాటు నారపోగు యాకోబు, హేమ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ తీసుకొచ్చేందుకు కృషి

సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క



మధిర : మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

మధిర: రాష్ట్రంలో బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టేలా కృషిచేస్తానని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. మధిరలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ బంధు చెక్కులను జెడ్పీ చైర్మన్ కమలరాజ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ జనాభాలో సగం ఉన్న బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో సగం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయం ఎవరి ఇంట్లోది కాదని.. ప్రజల సొమ్మేనని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు కొన్నేళ్లుగా నిలిచిపోయిన నిధులు విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని చెప్పారు. జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలుచేయని పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలుచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. చింతకాని మండలం నేరడలో సీసీ రోడ్లు, పల్లె దవాఖానా ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన పల్లెల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అనంతరం దళితబంధు లబ్ధిదారుల యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్ గొర్రెముచ్చు ఈశ్వరమ్మతో పాటు గురిజాల హన్మంతరావు, దూసరి గోపాలరావు, కె.యామిని, మంకెన రమేష్, పొనుగోటి రత్నాకర్, వంకాయలపాటి లచ్చయ్య, నన్నక కోటయ్య, పెంట్యాల పుల్లయ్య పాల్గొన్నారు.

ఫైలేరియాను పారదోలేలా...

- నేటి నుంచి 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్'
- మూడు రోజులు సెంటర్ల ద్వారా మూడు మాత్రల పంపిణీ
- ఆతర్వాత ఇంటింటా పంపిణీకి ఏర్పాట్లు



ఖమ్మం వైద్యవిభాగం: ఫైలేరియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బోదకాలు నివారణ కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలందరితో సామూహికంగా డీఈసీ, ఆల్బెండజోల్, ఐవర్ మెక్టిన్ మాత్రలు మింగించనున్నారు. గురువారం ఈ కార్యక్రమం మొదలుకానుండగా మొదటి మూడు రోజులు ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేస్తారు. ఆతర్వాత 13 నుండి 22వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి మాత్రలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో 3,500మంది బాధితులు

ప్రస్తుతం జిల్లాలో 3,550 మంది ఫైలేరియా బాధితులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నారు. వీరిలో 1,700 మంది ప్రభుత్వం నుంచి పింఛన్ తీసుకుంటున్నారు. అయితే, ఫైలేరియాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వం మూడు రకాల మాత్రలు మింగించే ఏర్పాట్లు చేసింది. సహజంగా బోదకాలు(ఫైలేరియా) క్యూలెక్స్ రకం దోమ కుట్టడం ద్వారా వస్తుంది. ఇంటి పరిసరాల్లోని మురుగునీటిలో గుడ్లు పెట్టి వృద్ధి చెందే క్యూలెక్స్ దోమ ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుంది.

5,166 మంది సిబ్బంది నియామకం

మూడు రకాల మాత్రలు మింగించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశలు, మెప్మా సిబ్బంది, ఐకేపీ సిబ్బంది కలిపి 5,166 మందిని నియమించగా, వీరికి ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు. అలాగే, కార్యక్రమ పర్యవేక్షణకు 517 మంది సూపర్‌వైజర్ సిబ్బందిని, పీహెచ్‌సీల స్థాయిలో పర్యవేక్షించటానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు. మొత్తం 31 బృందాలు ఏర్పాటు చేయగా ఒక్కో బృందంలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్ ఉంటారు. జిల్లావ్యాప్తంగా 14,35,184 మంది జనాభా ఉండగా వీరిలో 12,91,666 మందితో మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లుచేశారు.

విజయవంతం చేయండి

జిల్లాలో ఫైలేరియా నిర్మూలనకు గురువారం నుంచి చేపడుతున్న మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(సామూహిక మాత్రల పంపిణీ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి సూచించారు. రెండేళ్ల లోపు పిల్లలు, గర్భవతులు, వ్యాధులతో మంచాన పడిన వారు తప్ప మిగిలిన అందరితో మాత్రలు మింగించాలని ఉద్యోగులను ఆదేశించారు. తొలుత మూడు రోజులు పాటు 2,600 బూత్‌ల ద్వారా కార్యక్రమం కొనసాగుతుందని, ఆతర్వాత ఇంటింటికీ వెళ్లి మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఫైలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

మూడు రకాల మాత్రలతో చెక్

ఫైలేరియా నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా మూడురకాల మాత్రలు మింగించనున్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ తర్వాత 13వ తేదీ నుండి 22 వరకు ఇంటింటికీ తిరిగి మాత్రలు పంపిణీ చేయనున్నారు. డీఈసీ, ఆల్బెండజోల్, ఐవర్ మెక్టిన్ టాబ్లెట్లు సిద్ధం చేయగా.. రెండేళ్లు పైబడిన వారితో ఆల్బెండజోల్ ఒక మాత్ర మింగిస్తారు. 2–5 ఏళ్ల మధ్య వయస్సు వారికి ఒక డీఈసీ మాత్ర, 6–14 ఏళ్ల మధ్య వారికి రెండు మాత్రలు, 15 ఏళ్లు పైబడిన వారితో మూడు డీఈసీ మాత్రలు మింగించనున్నారు. అలాగే, ఐదు ఏళ్లు పైబడిన వారందరితో ఐవర్ మెక్టిన్ మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈమాత్రలను 3 నుండి 3.9 అడుగుల ఎత్తు వారికి ఒకటి, 4 నుండి 4.6 అడుగుల మధ్య వారికి రెండు, 4.7 నుండి 5.2 అడుగుల ఎత్తు ఉన్న వారికి మూడు, 5.2 అడుగుల పైన ఉన్న వారికి నాలుగు చొప్పున అందజేస్తారు.

క్లుప్తంగా

వైరా వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుధాకర్

వైరా: వైరాకు చెందిన బొర్రా సుధాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. వైరా మాజీ సర్పంచ్‌లు బొర్రా వెంకటేశ్వర్లు – పద్మావతి కుమారుడు సుధాకర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన ఓయూ రాజనీతి శాస్త్రం విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమణ పర్యవేక్షణలో 'ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ పొలిటికల్ పార్టిసిపేషన్ ఆఫ్ ఉమెన్ ఇన్ పంచాయతీరాజ్, ఏ కేస్ స్టడీ ఆఫ్ ఖమ్మం డిస్ట్రిక్ట్' అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా సుధాకర్‌ను పలువురు అభినందించారు.

ఖమ్మం ఆర్డీఓగా గణేష్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ఆర్డీఓగా హైదరాబాద్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుంటుపల్లి గణేష్‌ను నియమించారు. అలాగే, ఖమ్మం ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న కె.స్వర్ణలతను తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సీనియర్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై కేటాయించారు. కాగా, జిల్లాలోని ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. వీరిలో రాళ్లబండి రాంబాబు, బోడేపుడి రంజిత్, పవన్‌కుమార్, విజయ, స్వర్ణ ఉండగా, త్వరలోనే పోస్టింగ్ ఇవ్వనున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ పెంచుతూ నిర్ణయాన్ని వెలువరించింది. దీంతో జిల్లా రేషన్‌డీలర్ల సంఘం ఆధ్వర్యాన బుధవారం నగరంలోని జెడ్పీ సెంటర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా మాట్లాడుతూ క్వింటా కమీషన్ రూ.70ఉండగా... రూ.140కి పెంచడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, డీలర్ల సంఘం నాయకులు ఇబ్రహీం, విష్ణువర్ధన్‌రెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయకుండానే చేసినట్లు లెక్క!

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల కురిసిన వర్షాలతో నగరంలో దోమలు పెరిగాయి. దీంతో ప్రతిరోజు ఫాగింగ్ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈమేరకు గతంలో ఉన్న మిషన్లకు తోడు కొత్తవి కొనుగోలు చేయడంతో డివిజన్‌కు ఒక మిషన్ అందుబాటులోకి వచ్చింది. గత పదిరోజుల నుండి డివిజన్లలో నిరంతరాయంగా ఫాగింగ్ చేస్తున్నట్లు కేఎంసీ నుండి డీజిల్, పెట్రోల్ బిల్లులు డ్రా చేస్తున్నారు. అయితే, ఇద్దరు సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని 10 డివిజన్లలో ఫాగింగ్ జరగకున్నా చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు సమాచారం. రోజుకు ఒక్కో మిషన్‌కు ఐదు లీటర్ల డీజిల్, లీటర్ పెట్రోల్ కేఎంసీ నుండి ఇస్తుండగా... ఈ ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని తెలిసింది. ఇలా రూ.సుమారు రూ.40 వేల మేర స్వాహా చేశారని సమాచారం. ఈ విషయమై డీసీ మల్లీశ్వరిని వివరణ కోరగా ప్రతిరోజు అన్ని డివిజన్లలో ఫాగింగ్ జరుగుతోందని, అలా చేయనట్లుగా ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.32.45 కోట్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం రూ.32.45 కోట్లు మంజూరు చేసింది. వీటిని రఘునాథపాలెం మండలం జాన్‌బాద్ తండా, ఖమ్మంరూరల్ మండలం ఊటవాగుతండా, కూసుమంచి మండలం జక్కేపల్లి, నేలకొండపల్లి మండలం చెన్నారం, పైనంపల్లి, సదాశివపురం గ్రామాల్లో నిర్మించనున్నారు. కాగా, రైతాంగం మేలు కోసం నియోజకవర్గంలో ఆరు చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముదిగొండ: మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని మాధాపురానికి చెందిన బోయిన నాగరాజు (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన 7వ తేదీన పురుగుల మందు తాగాడు. దీంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు నాగరాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

'గృహలక్ష్మి' సందడి!



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహిళలు

జిల్లా అంతటా గృహలక్ష్మి సందడి నెలకొంది. సొంత స్థలం కలిగి ఇల్లు లేని వారికి నిర్మాణం కోసం రూ.3లక్షలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలకు బారులు దీరుతున్నారు. ఫలితంగా బుధవారం ఎక్కడ చూసినా క్యూ లైన్లు, కిక్కిరిసిన కార్యాలయాలే కనిపించాయి. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం అర్బన్ తహసీల్‌లో..



కొణిజర్ల : తహసీల్ వద్ద గుమిగూడిన దరఖాస్తుదారులు



రఘునాథపాలెం : దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న తహసీల్



వేంసూరు : తహసీల్ వద్ద లబ్ధిదారుల క్యూ



రఘునాథపాలెం : దరఖాస్తులు నింపుతున్న మహిళలు

సోనీ పేరిట కుచ్చుటోపీ!

- నకిలీ టీవీలు అమ్ముతున్న ముగ్గురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సివిల్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు బస్వారెడ్డి, శివరామయ్య

ఖమ్మంరూరల్: ప్రఖ్యాత సోనీ బ్రాండ్ పేరిట నకిలీ టీవీలు అమ్ముతున్న ఐదుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ ముఠాలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. ఈమేరకు ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంలో నకిలీ టీవీలు అమ్ముతుండగా బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సివిల్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు బస్వారెడ్డి, శివరామయ్య వివరాలు వెల్లడించారు.

అధిక ఆదాయం కోసం...

యూపీలోని షామిలి జిల్లా ఇస్లాంపూర్ ఘుసాలి గ్రామానికి చెందిన సద్దాం, ఆసిఫ్, అనూప్‌ఖాన్‌తో పాటు ఇద్దరు మైనర్లు హైదరాబాద్‌లో దుప్పట్లు, గ్యాస్ స్టౌలు అమ్ముతూ కొన్నాళ్లుజీవనం సాగించారు. అయితే, వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో నకిలీ టీవీలు అమ్మాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి వచ్చి ఇల్లు అద్దెకు తీసుకుని హైదరాబాద్‌లో అసెంబుల్డ్ టీవీలు తీసుకొచ్చి.. వాటిని సోనీ టీవీలుగా స్టిక్కర్లు, స్టార్ రేటింగ్ లోగోలు వేసి అమ్మడం మొదలుపెట్టారు. అంతేకాక ఆర్మీ క్యాంటీన్‌లో సభ్యత్వం ఉన్నట్లు నకిలీ కార్డు సృష్టించి అక్కడ తక్కువ ధరకు వస్తుండడంతో అదే ధరకు అమ్ముతున్నట్లు ప్రజలను నమ్మబలికారు. ఈసమయంలో ఎవరైనా టీవీ కొనుగోలు చేస్తే అది ఆన్ చేయగానే తమ వద్ద ఉన్న పెన్‌డ్రైవ్‌తో సోనీ అని డిస్‌ప్లే వచ్చేలా చేసేవారు. ఈక్రమాన ఒక్కో టీవీని రూ.15వేలు నుండి రూ. 20వేలు వరకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అదుపులోకి తీసుకన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.2.90లక్షలు నగదు, 32 టీవీలు, కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చినా, అద్దె ఇళ్ల కోసం ఆరా తీసినా సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. ఈసమావేశంలో సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఆదివాసీ విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

ఖమ్మంమయూరిసెంటర్: సంప్రదాయ దుస్తులు, డప్పు వాయిద్యాలతో ఆదివాసీ విద్యార్థులు ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నగరంలోని గిరిజన భవనం వద్ద ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యాన జెండాను ఆవిష్కరించారు. అనంతరం పెవిలియన్ మైదానం నుండి మయూరిసెంటర్, వైరారోడ్డు, జెడ్పీ సెంటర్ మీదుగా ధర్నాచౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఆతర్వాత గిరిజన భవనంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చే యూనిఫామ్ సివిల్ కోడ్‌ను వెనక్కి తీసుకోవాలని, మణిపూర్‌లో ఆదివాసీలను రక్షించాలని, తెలంగాణలో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. ఏఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సున్నం సతీష్‌కుమార్, నాయకులు జిమ్మ సందీప్, ఈసం సాగర్, కాయం లక్ష్మణ్, అన్నెబోయిన చందు, కుంజ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వెన్ను విరుస్తున్న ప్రభుత్వాలు

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి రైతుల వెన్ను విరుస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేలా నూతన చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యాన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాగా, తెలంగాణలో పంటల బీమా పథకం లేకపోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయాన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈమేరకు తక్షణమే పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ప్రకటిస్తున్నా ఏది కూడా పూర్తి స్థాయిలో అమలుచేయడం లేదన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, నాయకులు బానోత్ కోటి, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, అమరనేని వీరభద్రం, తాతా వెంకటేశ్వర్లు, దొబ్బల కృష్ణ, పావులూరి మల్లికార్జునరావు, సోమయ్య, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ ఉత్సవాలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్‌తో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కేక్ కట్ చేశారు. నాయకులు కొండూరి హృదయ్‌కిరణ్, జగ్రిపోతుల అంజని, బొందయ్య, బానోత్ సైదేశ్వరావు, బి.అన్వేష్, ఉపేందర్, సర్దార్‌బాబు, బొల్లం మహేష్, హుస్సేన్, గుగులోత్ రాజేష్, దొంతగాని నాగరాజు, గుగులోత్ హర్షనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి



విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణిస్తే దేశాభివృద్ధిలో పాలు పంచుకునే అవకాశం లభిస్తుందని ముంబైలోని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బీఏఆర్‌సీ) శాస్త్రవేత్తలు సౌరబ్, అనురూప్ దాస్ తెలిపారు. కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం 'పరమాణు జ్యోతి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హాజరైన శాస్త్రవేత్తలు పవర్ పాయింట్ ప్రజెటేషన్ ద్వారా అణువిద్యుత్ తయారీ కేంద్రాలు, ఉపయోగాలను వివరించి మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్న నేపథ్యాన విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా తయారుకావాలని సూచించారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపల్ నాగభూషణం మాట్లాడగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

100 అడుగుల మేర వెడల్పు చేయాల్సిందే..

వైరా: వైరాలోని రింగ్ రోడ్డు నుంచి రిజర్వాయర్ వరకు 100 మేరకు రహదారి అభివృద్ధి చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి రహదారి వెడల్పు, ఆక్రమణల తొలగింపులో పక్షపాతాన్ని విడనాడాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వివిధ పార్టీల నాయకులు బానోత్ విజయాబాయి, మాలోత్ రాందాస్, కట్ల రంగారావు, బొంతు రాంబాబు, కృష్ణారావు, చలపతిరావు, గోపాలరావు, సురేందర్, సీతారాములు, అశోక్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు...



వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ సారంగపాణి

ఖమ్మంక్రైం: వాహనాల సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. ఈమేరకు ఎక్కువ శబ్దం వచ్చేలా సైలెన్సర్లు బిగించిన వాహనాలను గుర్తించేందుకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురి వాహనాలను గుర్తించి అక్కడికక్కడే మెకానిక్‌లతో తొలగించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలతో పాటు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పాత కలెక్టరేట్ వద్ద బుధవారం 'మహాపడవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ మోడీ పాలనలో అడుగడుగునా కార్మిక సంక్షేమ చట్టాలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఇదే సమయాన కార్పొరేట్ శక్తులకు అనుకూల నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, ఆవుల అశోక్, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, సుధాకర్‌రెడ్డి, అప్పారావు, పి.రమ్య, సీహెచ్.సీతామాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు, యూసీసీకి వ్యతిరేకంగా పోరాటాలు

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండతో పాటు యూసీసీకి వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యాన నిర్వహించే పోరాట కార్యక్రమాలను జయప్రదం చేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఇప్పటికే మణిపూర్ ఘటనలతో దేశం అట్టుడికి పోతోందని తెలిపారు. అయినా అక్కడి ప్రజల భద్రతపై పాలకులు స్పందించడంలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగానే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యూసీసీ బిల్లు తీసుకురావాలని కేంద్రం చూస్తోందని తెలిపారు. ఈ అంశాలపై పోరాట కార్యాచరణ రూపొందించగా, అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని వారు కోరారు. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, డాక్టర్ గోపీనాథ్ విద్యావేత్తలు వై.వీ.రమణారావు, రవిమారుత్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎర్ర శ్రీకాంత్, తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, ఆవుల అశోక్, పీ.వీ.శ్రీనివాస్, మోహన్‌రావు, ఎం.సుబ్బారావు, వై.విక్రమ్, పి.విజయకుమార్, కిషన్ నాయక్, బస్కినాయక్, ఎస్.కే.బాబు, ఎస్.కేనాగుల్ మీరా, ఎల్.వీ.రావు, కళ్యాణం నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బంధువులు కాళ్లు, చేతులు కట్టేసి కొట్టడంతో ఘటన



అశోక్ (ఫైల్)

వేంసూరు: మేనమామ, ఆయన కుమారుడు కలిసి కాళ్లు, చేతులు కట్టేసి కొట్టడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన కొక్కెరగడ్డ అశోక్(35) ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి పశువుల పోషణ, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఆయన గేదెల్లో ఒకటి అమ్మేందుకు యత్నించగా తాత ఇమ్మానియేల్ అడ్డుపడ్డాడు. దీంతో తాను కొనుగోలు చేసిన పాత టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని అశోక్ ఇంటికి తీసుకెళ్లాడు. ఈమేరకు ఆగ్రహించిన ఆయన మేనమామ కొంక వెంకటేష్, కుమారుడు ఆదినారాయణ కలిసి అశోక్ కాళ్లు, చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన అశోక్ పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు సత్తుపల్లి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

తరగతి గదిలో సెల్‌ఫోన్లు వాడొద్దు

ఏన్కూరు: ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే సస్పెండ్ చేస్తామని డీఈఓ సోమశేఖర్‌శర్మ హెచ్చరించారు. ఏన్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను సామర్థ్యాలను పరిశీలించిన ఆయన బోధనపై ఆరా తీసి హాజరుశాతం పెరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా కందకం

ముదిగొండ: మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదిగొండ తహసీల్దార్ రామారావు, ఎస్‌ఐ గజ్జెల నరేష్ హెచ్చరించారు. మున్నేరు నుంచి ఇసుక తరలిస్తున్నారన్న ఫిర్యాదులు అందడంతో మండలంలోని పెద్దమండవ, గంధసిరి వద్ద పరీవాహక ప్రాంతాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈమేరకు ట్రాక్టర్లు రాకుండా మున్నేరుకు వెళ్లే రహదారిపై జేసీబీతో కందకం తవ్వించారు.

గోడ కూలి విద్యార్థికి తీవ్ర గాయాలు



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రహరీ కూలడంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఏన్కూరు మండలం సోములగడ్డకు చెందిన ఎం.అరవింద్ గురుకులంలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల పాత ఎస్‌ఎస్పీ క్వార్టర్స్ ఆవరణలో నిర్మించగా, పాత క్వార్టర్లు అలాగే ఉన్నాయి. ఈక్రమంలో అరవింద్ మూత్రం పోసేందుకు క్వార్టర్స్ వెనక భాగానికి వెళ్లగా ఇటీవల వర్షాలతో నానిన గోడ కూలి ఆయనపై పడింది. దీంతో కాలు రెండు చోట్ల విరగగా, ముక్కుకు సైతం గాయమైంది. అయితే, నిర్మాణ పనుల కోసం ఇటుకలు తీసుకురావాలని సూచించడంతో ఆయన వెళ్లగా ఘటన జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈమేరకు ఆయనకు ఖమ్మం పెద్దాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించాక శస్త్రచికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే, విషయం తెలుసుకున్న అరవింద్ తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు వారికి నచ్చచెప్పి ఆందోళన విరమింపజేయగా, గురుకులాల ఆర్‌సీఓ జ్యోతి విద్యార్థి ఆరోగ్యంపై ఆరా తీశారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

కూసుమంచి: వరి నాట్లు వేసేందుకు పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడడంతో రైతు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లాపురానికి రైతు పల్లా రవీందర్‌రెడ్డి(50)కి కూసుమంచి మండలం రాజుపేటలో వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడ నాట్లు వేసేందుకు ఆయన బుధవారం ట్రాక్టర్‌తో దున్నుతుండగా, అది తిరగబడింది. ఈక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాడైపోయిన గుడ్లు పంపిణీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని గోపాలపురం అంగన్‌వాడీ సెంటర్–2లో పాడైపోయిన కోడిగుడ్లు ఇచ్చారని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం పరిధిలోని చిన్నారులకు బుధవారం అంగన్‌వాడీ టీచర్ భారతి కోడిగుడ్లు పంపిణీ చేశారు. అయితే, వాటిని తల్లులు ఇంటికి తీసుకెళ్లి ఉడికించగా ముగిగిపోయినట్లు గుర్తించి తిరిగి కేంద్రానికి వచ్చారు. ఈసందర్భంగా టీచర్ మాట్లాడుతూ వచ్చిన గుడ్లను పంపిణీ చేశామే తప్ప తమ తప్పేం లేదని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఈ విషయంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోటేశ్వరిని వివరణ కోరగా ఈ అంశంపై విచారణ జరిపి మరోమార జరగకుండా చూస్తామని తెలిపారు.